పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

సింగరేణి కాలనీలో బడి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, విద్యాశాఖ అధికారి రోహిణి

సైదాబాద్, మార్చి 25: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ బాంబే గృహ సముదాయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణానికై మంగళవారం హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, సైదాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ స్థల పరిశీలన చేశారు. స్థానికంగా ఉన్న సరళ దేవి నగర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ ప్రదేశంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నిర్మించాలని సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోవడంతో అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. హైదరాబాద్ అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, సైదాబాద్ ఎమ్మార్వో జయశ్రీ, డిప్యూటీ విద్యాశాఖ రాధాకృష్ణ సింగరేణి కాలనీ సరళ దేవి ప్రాథమిక పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుని స్థానికంగా ఉన్నత పాఠశాలను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు అలివేలు, తల్లుల సంఘం నాయకురాలు సాయి లక్ష్మి సంతోషి, దళిత విమెన్ కలెక్టివ్, సేఫ్ ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, పావని, సీపీఐ నాయకులు అంజయ్య, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి.. అక్రమాలు

- ఎల్బీనగర్ జోన్‌లో 15 మంది న్యాక్ ఇంజినీర్లపై వేటు
- చర్యలు తీసుకున్న జీహెచ్ఎంసీ కమిషనర్

ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం

ఎల్బీనగర్, మార్చి 25: టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతికి పరాకాష్టగా మారిన న్యాక్ ఇంజినీర్లు (సైట్ ఇంజినీర్ల)పై జీహెచ్ఎంసీ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 27 మంది న్యాక్ ఇంజినీర్లను టెర్మినేట్ చేయగా అందులో 15 మంది ఎల్బీనగర్ జోన్ పరిధిలోని వారే కావడం గమనార్హం. అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను గుర్తించి అడ్డుకోవాల్సిన న్యాక్ ఇంజినీర్లు అవినీతి కార్యకలాపాలు, బాధ్యతారాహిత్యం నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్లు ఉండగా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా ఉంటూ ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోవడంలో తాత్సరం చేస్తున్నారు. టర్మినేట్ చేసిన వారిలో కాప్రా సర్కిల్‌కు చెందిన ఈడిగ మెర్లిన్ మిరియం, కరణం యోగేశ్వర్‌రావు, వేరుగంటి అశ్విని, ఉప్పల్ సర్కిల్‌కు చెందిన కుసుముల్ల దివ్య, ఎండీ రీమా, జంగం అరుణ, హయత్‌నగర్ సర్కిల్‌కు చెందిన టి.సునీల్‌కుమార్, మహ్మద్ గౌస్ పాషా, సంధ్యశాంతి, ఎల్బీనగర్ సర్కిల్‌కు చెందిన కె.నందిని, ముద్దగోని సాయిరాం, సరూర్‌నగర్ సర్కిల్‌కు చెందిన యంజాల సాయిపావనిలక్ష్మి, బండ శైలజ, పోలేపల్లి నాగరాజు, కుసుమని సుదీష్ణను విధి నిర్వాహణలో నిర్లక్ష్యతో పాటుగా అవినీతికి పాల్పడుతున్న నేపథ్యంలో టర్మినేట్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

అక్రమ నిర్మాణాల జోరు..

ఫిర్యాదు వచ్చినా కాలయాపన..

ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతుంటే అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. అనుమతి లేని నిర్మాణాలపై అదిలోనే ఫిర్యాదు చేస్తే సదరు స్థలాన్ని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన సదరు అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదుదారుడు ఒత్తిడి తెస్తే నిర్మాణం పూర్తయినా నోటీసులిచ్చి కూల్చివేస్తాం, మీరేమి ఆందోళన చెందకండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. అయితే నిర్మాణాలు సెలవు దినాల్లో చేపట్టాలని సలహాలిస్తున్నారు. ఒకవేల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రం చర్యలు తీసుకొని ఆపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోండంటూ అమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారు. ఇక పేదలు నిర్మాణాలు చేపడితే మాత్రం ప్రతాపం చూపుతారు.

అనుమతులు కావాలంటే అమ్యామ్యాలే..

అనుమతుల కోసం అమ్యామ్యాలు లేనిదే ఇవ్వడం లేదన్నది సుస్పష్టం. అన్ని సక్రమంగా ఉన్న ప్లాన్ల అనుమతులకు నామినల్‌గా తీసుకుంటున్న అధికారులు సైట్ ఇన్‌స్పెక్షన్ పేరుతో భవన నిర్మాణ పరిస్థితులను గమనించి చూసి తమ రేటును పెంచుతున్నారు. బహుళ అంతస్తుల భవనాల అనుమతుల్లో, మార్ట్‌గేజ్ రిలీజ్ విషయంలో, భవనాల ఒసీల జారీలో మాత్రం పెద్దగానే ముడుపులు పుచ్చుకుంటున్నారు. కొందరు అధికారులు తమకు అనుకూలంగా యూట్యూబర్స్, చిన్న పత్రికల వారిని కూడా ఏజెంట్లుగా వాడుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయాలపై కూడా జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టి సారించి అవినీతి చేపలపై చర్యలు తీసుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

నీటి ఇంధన వనరులను కాపాడుకోవాలి

జల సంరక్షణ సదస్సులో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు, ఫైర్ స్టేషన్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

హయత్‌నగర్, మార్చి 25: నీటితోపాటు ఇంధన వనరులను కాపాడుకోవాలని డిప్యూటీ ఆర్ఎంఓ శంకర్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మంగళవారం సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సౌజన్యంతో హయత్‌నగర్ ఆర్టీసీ డిపో 1,2 లలో ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నీటి, ఇంధన వనరుల వృథా అరికట్టడంలో ఆర్టీసీ సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. హయత్‌నగర్ డిపో -1 మేనేజర్ జలగం విజయ్ కుమార్ మాట్లాడుతూ సిబ్బంది ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటి వనరులను కాపాడాలని సూచించారు. డీజీఎం రాజగోపాల్ మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ గ్యాసెస్ వల్ల మంచు పర్వతాలు కరిగి మానవాలికి నష్టం వాటిల్లడంతో పాటు నీటి కరువు సంభవిస్తుందన్నారు. ప్రజల భాగస్వాములను చేసి, నీటి సంరక్షణపై అవగాహన కల్పిండమే తమ సంస్థ ఉద్దేశమని సంస్థ సీఈఓ ఎస్.నాగబ్రహ్మచారి తెలిపారు. ఈ సందర్భంగా అందరితో జల ప్రతిజ్ఞ చేయించారు. హయత్‌నగర్ డిపో-2 మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, ఫైర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఆర్టీసీ రెండు డిపోల సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా చేశారని ఫిర్యాదు.. పరిశీలించిన హైడ్రా

బడంగ్‌పేట్, మార్చి 25: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయపల్లి ఎన్‌క్లేవ్‌లో రోడ్డును కబ్జా చేశారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా సీఐ తిరుమలేష్ మంగళవారం పరిశీలించారు. లే అవుట్‌లో రోడ్డు ఉండగా ఎందుకు ప్యాక్ చేశారని ప్రశ్నించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బోయపల్లి ఎన్‌క్లేవ్ వాసులకు లే అవుట్ ప్రకారం రోడ్లు, పార్క్ స్థలం వదిలేయాలన్నారు. 2014లో సర్వే నంబర్ 39, 40, 41, 42, 44ల్లో ఐదెకరాల భూమిలో పాత పంచాయతీ లే అవుట్ ప్రకారం ప్లాట్లు చేసి అమ్మినట్లు తెలిపారు. పాసు పుస్తకాలు ఉన్నాయని భూ యజమానులు చెప్పారు. అమ్మిన తరువాత పాస్ పుస్తకాలున్నాయని ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. రైతుబంధుతోపాటు ఉచిత కరెంటు వాడుకున్నామంటూనే కమర్షియల్ స్టేడియం నిర్మాణం ఎలా చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లే అవుట్ ప్రకారం యజమానులే కాలనీవాసులకు పార్క్ స్థలం కల్పించాలన్నారు. రోడ్లకు అడ్డుగా బ్రిక్స్ తొలగించాలన్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు హైడ్రా సీఐకి వివరించారు. రెండు రోజులలో తొలగించకపోతే చర్యలు చట్టప్రకారం తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బోయపల్లి ఎన్‌క్లేవ్‌కాలనీలో అడ్డుగా వేసిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న హైడ్రా సీఐ తిరుమలేష్

మహిళలు రాణిస్తేనే దేశం అభివృద్ధి

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఆర్కేపురం, మార్చి 25: మహిళలు రాణించినప్పుడే దేశం అన్నిరంగాల్లో ముందుకెళ్తుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అష్టలక్ష్మి మహిళా మండలి స్థాపించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా వాసవికాలనీ ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఎంతో ప్రగతిని సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, స్థానిక కార్పొరేటర్ రాధ, కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సామాజిక వేత్త చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, నాయకులు నేలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ శ్రీనివాస్, సిద్ధగోని వెంకటేష్‌గౌడ్, రామ్‌నరసింహగౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, రమేష్ కురుమ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేస్తున్న చేపూరి శంకర్ తదితరులు

వనస్థలిపురం, మార్చి 25: పరీక్షలకు హాజరవుతున్న ఎస్సెస్సీ విద్యార్థులకు మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. వనస్థలిపురంలోని పలు కేంద్రాల వద్ద అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఎండ వేడిలో వారికి ఉపశమనం కలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రతి విద్యార్థికి వాటర్ బాటిల్, మజ్జిగను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యోగిత కిరణ్, చేపూరి సునీత తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్, మార్చి 25: సైదాబాద్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మలక్‌పేట ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఐక్యతకు సోదర భావానికి ఇఫ్తార్ విందులు ప్రతీక నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, మజ్లిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేయాలి

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు

హయత్‌నగర్, మార్చి 25: ఆర్టీసీ అభివృద్ధి కోసం ఉద్యోగులు, సిబ్బంది ఎల్లవేళలా కృషి చేయాలని హయత్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు వి.శంకర్, ఎస్.మాధవి అన్నారు. మంగళవారం హయత్నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లుగా బాధ్యతలు స్వీకరించిన డీఆర్ఎంలు హయత్నగర్-1 డిపోలో ఫిబ్రవరి మాసం ఉత్తమ ఉద్యోగుల అభినందన కార్యక్రమానికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సంస్థ ఉద్యోగుల అభివృద్ధికి, శ్రేయస్సుకు కృషి చేస్తున్నదని, సంస్థ పట్ల ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి లాభాల బాటలోకి తీసుకెళ్లాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన డ్రైవర్, కండక్టర్, మెకానిక్, సిబ్బందికి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్లు విజయకుమారి, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మసీదు నిర్మాణం కోసం కృషి

నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కందుకూరు, మార్చి 25: మండల పరిధిలోని బాచుపల్లిలో మసీదు నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు గ్రామ తాజా మాజీ సర్పంచ్ యాదాద్రి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మజీద్ పనులను ముస్లిం మత పెద్దలు రసీద్, మదర్ సాబ్, జాంగిర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతన దర్గాను అంచలంచెలుగా మత పెద్దలతో కలిసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం గందం ఉత్సవాలు ఎంతో ఉత్సాహంగా జరుగుతాయని చెప్పారు. మసీదు నిర్మాణం కోసం అందరూ సహకరించాలని ఆయన కోరారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, చెన్నయ్య, థామస్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

వేసవిలో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న పాండుయాదవ్

బడంగ్‌పేట్, మార్చి 25: మహేశ్వరం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ మంచే పాండుయాదవ్ అధ్యక్షతలో నిర్వహించారు. వేసవిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. పశువులకు కావలసిన నీళ్లు, మేత వంటి అంశాలను చర్చించారు. రైతులు ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు చేయవలసిన రుణమాఫీ, రైతు బంధు గురించి చర్చించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పోల్కం బాలయ్య, కాదేమోని ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి ఆవుల నర్సింహ, జంగయ్య, విజయమ్మ, లక్ష్మమ్మ, అగ్రికల్చర్ సీఈఓ మహమ్మద్ షఫీ ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సైదాబాద్, మార్చి 25: రంజాన్ పండుగ కోసం కొత్త బట్టలు కొనుగోలు కోసం చార్మినార్‌కు షాపింగ్ వెళ్లిన ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు విలువైన ఫోన్లు తస్కరించిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు వివరాల ప్రకారం సైదాబాద్ లోకాయుక్తకాలనీలో నివసించే మిర్జా కరామతుల్లా, అస్రా ఫాతిమా దంపతులు. పండుగ కోసం దుస్తులు కొనుగోలు చేయడానికి చార్మినార్‌కు వెళ్లారు. షాపింగ్ ముగించుకుని వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి కనిపించింది. బీరువాలోని విలువైన 20 తులాల బంగారు ఆభరణాలను, ఐఫోన్ తోపాటు మరో ఫోను, విలువైన గడియారాన్ని తస్కరించుకొని వెళ్లారు. దీంతో బాధితులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

జూనియర్ బ్యాడ్మింటన్ విజేతకు అభినందన

స్పానిష్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన అభిషేక్‌ను అభినందిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, మార్చి 25: ఇటీవల స్పెయిన్ లో జరిగిన స్పానిష్ జూనియర్ ఓపెన్ బ్యాట్మింటన్ పోటీలు జూనియర్ విభాగంలో పాల్గొని విజేతగా నిలిచిన కనపాల అభిషేక్ మంగళవారం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలుసుకున్నారు. జూనియర్ విభాగం బ్యాట్మింటన్ పోటీల్లో మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన అభిషేక్ను ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన అభిషేక్ ముందు ముందు మరిన్ని పథకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బ్యాట్మింటన్ అసోసియేషన్ సభ్యుడు వికాస్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా సిటీ రద్దు చేస్తే భూములను తిరిగివ్వాలి

ఆకుల మైలారం గ్రామంలో మాట్లాడుతున్న యాదయ్య

కందుకూరు, మార్చి 25: ఫార్మాసిటీని రద్దు చేస్తే భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దు చేసి భూములను తిరిగి రైతులకు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఆ భూముల్లో ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులను చైతన్య పరచడానికి మండల పరిధిలోని ఆకుల మైలారంలో జీపు జాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తుందని, ఫోర్త్ సిటీ రోడ్డు ఏర్పాటు కోసం రైతుల అంగీకారం లేకుండా భయభ్రాంతులకు గురిచేసి, పోలీసు బలగాలను మోహరించి భూసర్వే చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రైతులకు తక్కువ నష్ట పరిహారం చెల్లించి కోట్ల విలువచేసే భూములను గుంజుకుంటుందన్నారు. ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 121 గజాల ఇంటి స్థలం ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ ఇంటి స్థలాలను అప్పగించలేదని విమర్శించారు. ఫోర్త్‌సిటీలో భూములకు కోల్పోతున్న రైతులకు 500 గజాల ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం, మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు మూడు రెట్లు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వమే భూమికి భూమి సేకరించి ఇవ్వాలని సూచించారు. జీపుజాత మీర్ఖాన్‌పేట్, బేగరి కంచ, అన్నోజిగూడ, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు దుబ్బాక రామచందర్, సభ్యులు గొర్రెంకల నరసింహ, మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, అంజయ్య, భూషణ్, మండల మాజీ కార్యదర్శి శ్రీనివాస్, నరసింహ, శ్రీరాములు, కృష్ణ, నరహరి, గండు నరసింహ, కాళిదాస్, శివయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

కందుకూరు, మార్చి 25: ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో అన్నాదమ్ములను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కందుకూరు సీఐ సీతారాం వివరాల ప్రకారం మండల పరిధిలోని సరస్వతిగూడకు చెందిన మొలగాసి సుధాకర్(34) అదే గ్రామానికి చెందిన శమంత(శశికల)తో కొంత కాలంగా పరిచయం పెరిగి స్నేహంగా ఉంటున్నారు. అప్పటికే శశికళ భర్త మృతి చెందాడు. దీంతో పుట్టింటి వద్ద కూతురుతో కలిసి ఉంటుంది. సుధాకర్ శమంతను పెళ్లి చేసుకుంటానని చెప్పి చనువుగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె సోదరులు మాదరమోని శేఖర్, వినయ్, ఇద్దరినీ మందలించారు. కాగా సుధాకర్ వద్ద శమంత కొంత డబ్బును అప్పుగా తీసుకున్నది. ఆ డబ్బులను ఇవ్వాల్సిందిగా సుధాకర్ ఆమె ఇంటికి గత శనివారం వెళ్లి అడిగాడు. అదే సమయంలో ఆమె సోదరులు ఇంట్లోనే ఉన్నారు. ఈ విషయంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో శమంత తన సోదరులతో కలిసి పోలీస్ స్టేషన్లో సుధాకర్‌పై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సుధాకర్ తన తల్లిని బైకుపై ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి లేమూరు మీదుగా వస్తుండగా సుధాకర్ బైకును అటకాయించారు. అతడిని కింద పడేసి దాడి చేశారు. సుధాకర్‌కు తీవ్ర గాయాలు కాగా అపస్మారకస్థితికి వెళ్లడంతో మృతి చెందాడని భావించి అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత అతడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా మృతి చెందాడు. నిందితులపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



న్యాయవాది ఇజ్రాయిల్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్, మార్చి 25: మహేశ్వరం మండలం తుమ్మలూరులో న్యాయవాది ఇజ్రాయిల్ పార్థివదేహానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్ ఆర్, జెరూషలేం మత్తయ్య, హైకోర్టు అడ్వకెట్ సుదీర్, క్రైస్తవ నాయకులు సుజీవన్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిని దారుణంగా హత్య చేయడం అత్యంతదారుణమని అన్నారు. వివిధ పార్టీల నాయకులు సంఘాల నాయకులు నివాళుర్పించారు.

పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం

మన్సూరాబాద్, మార్చి 25: మనసురాబాద్ డివిజన్ శివగంగా కాలనీలోని పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించాడని కాలనీ అధ్యక్షుడు తొంట బాబు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు మంగళవారం హయత్ నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాంసన్, టీపీఓ అక్బర్ తదితరులు శివగంగ కాలనీకి విచ్చేసి ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని పరిశీలించారు. కాలనీవాసులు అందజేసిన పత్రాలతో పాటు.. ఆక్రమణదారుడి పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు స్థలాన్ని త్వరలో స్వాధీనం చేసుకొని ప్రహరీ నిర్మిస్తామని అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కందుకూరు, మార్చి 25: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మండలం సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న వారిపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం హైదరాబాద్ శ్రీశైలం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.9వేలు ఉన్న వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతానని కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, మేనిఫెస్టోలో పొందుపరిచి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా మోసం చేసిందన్నారు. 50లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అండాలు, శ్రీలత, మాధవి, మంజుల, అనిత, అనురాధ, రేణుక, యాదమ్మ, సురేఖ, లావణ్య, సుశీల, విజయ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బాలరాజ్ తెలిపారు. వీవోఏ సమస్యలు పరిష్కారం కోసం చలో హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి ఆయన సంఘీభావం తెలిపారు.

కందుకూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశ వర్కర్లు